## సమస్యలకు నాణ్యమైన పరిష్కారం : కలెక్టర్



చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, డిప్యుటీ కలెక్టర్లు కరుణకుమారి, విజయలక్ష్మిలు, నగరి అర్డీఓ అనుపమ, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



## అర్జీదారుల సమస్యలపై పరిష్కారం చూపాలి : కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త 2 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవ ప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

### నూతన ఈఓ ముద్దాడ

## రేపు అధికారికంగా బాధ్యతలు




తిరుమల,పిబ్రవరి 2పభాతవార్తప్రతినిధి: తిరుమల ఆలయ పవిత్రత కాపాడటం ,సామాన్య భక్తులకు ఇతోధిక సేవలందించేందుకు ,సాంకేతికతపై అవగాహన కలిగించుకుని పాలన సాగించడంపై టిటిడి నూతన ఈఓగా నియమితులైన ముద్దాడ రవిచంద్ర దృష్టి పెట్టనున్నారు. వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదబలం,తన పూర్వజన్మసుకృతం,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నమ్మకంతోనే ఈఓగా నియమించడం జరిగిందని అభిప్రాయంతో వస్తున్నారు. ఆ భగవంతుని సన్నిధిలో పనిచేసే అవకాశం తనలో మరింత బాధ్యతను గుర్తుచేయడమేనని మనసులో భావిస్తున్నారు. ఈఓగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. గతంలోనూ తిరుమలకు కుటుంబంతో కలసి వచ్చానని గుర్తుచేసుకున్నారు.కాగా 2026-27 వార్షిక బడ్జెట్‌పై కూడా ముద్దాడ మార్కుపాలన చూపాల్సి ఉంది. నేటి మధ్యాహ్నం తిరుపతికి విచ్చేస్తున్న ముద్దాడ బుధవారం (రేపు)ఉదయం ఆయన వేంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్న తరువాత ఆలయంలోపల ఈఓగా బాద్యతలు చేపట్టనున్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో జిల్లా కలెక్టర్‌గా 2008-2009 మధ్యకాలంలో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ జిల్లాకు సుపరిచితులే. మంచి అధికారిగా కూడా పేరుంది. అప్పట్లోనే ఉద్యోగులకు పక్షపాతిగా..ప్రజా.సమస్యల పరిష్కారంలో సున్నితత్త్వంతో వ్యవహరించారనేది అధికారవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన టిటిడి ఈఓగా వస్తుండటం,ముక్కుసూటి అధికారిగా అధికారవర్గాల్లో ఉండటంతో ఈ పదవిలో ఆయన తన పాలన అనుభవంతో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. టిటిడి ఈఓగా పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టాక ఎలాంటి సంచలన నిర్ణయాలు తీసుకోనున్నారనేది చూడాల్సిందే.

# ధరల దరువు: సామాన్యుడి బతుకు బరువు

## దడ పుట్టిస్తున్న నిత్యావసర సరకుల ధరలు



**నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నాయి. పండగ సమయంలో ధరలకు ప్రస్తుత ధరలకు 50శాతం పెరుగుదలతో సామాన్యుడు తల్లడిల్లి పోతున్నాడు. ఒక్కొక్క సీజన్‌లో ఒక్కోక్క రకం నిత్యావసర సరకుల ధరలకు రెక్కలొస్తున్నాయి. రెండు నెలల క్రితం టమోటాలు కిలో రూ.150లకు పెరగగా ప్రస్తుతం పప్పులు,నూనె ధరలు క్రమంగా పెరుగుతున్నాయి.దాంతో కిరాణ కొట్టుకు వెళ్ళి వారు ధరల దరువుతో ఎలా బతేకేదబ్బా అంటూ తల్లడిల్లుతున్నాడు.సామాన్యుడి ఆదాయాలకు వస్తువుల ధరలకు సమతౌల్యత కుదరక సతమతమౌతున్నాడు.**

శ్రీకాళహస్తి, ప్రభాతవార్త

'రెక్కాడితే గాని డొక్కాడని సామాన్యుడి పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారింది. మార్కెట్లో ఒక్కొక్క రోజు ఒక్కొక్క ధర పలుకుతుండటంతో సతమతమౌతున్నాడు. ఏం కొనేది? ఏం తినేది? అన్నట్లు మారింది. సంక్రాంతి పండగ ముందు అందుబాటులో ఉన్న పప్పుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.సామాన్యుడు ఉపయోగించే పప్పుల్లో మొదటి ప్రాధాన్యత కందిపప్పుకు ఉంది. ఈ కందిపప్పు సచిన్ బ్రాండ్ కిలో రూ.150లకు చేరింది. పండగ సమయంలో కిలో రూ.125 నుంచి 130 ఉండగా ఒకే సారి కిలోకు రూ.20లు పెరిగింది. ఇక ప్రతి అంశానికి ఉపయోగించుకునే ఉద్దిపప్పు ధర కిలోకు రూ.20లు పెరిగింది. ప్రస్తుతం మేలు రకం ఉద్ది పప్పు కిలో రూ.130కి చేరింది. ఇదే కాకుండా చింతపండు,మిరపకాయలు ధరలు కిలోకు 25 నుంచి రూ.50లకు పెరిగింది. మిరపకాయల ధరలు ఘాటును సామాన్యుడు తట్టుకోలేక పోతున్నాడు.ఇక వంట నూనెల ధరలు సల సల కాగుతున్నాయి.సామాన్య మధ్యతరగతి ప్రజలు వాడే పామోలిన్ నూనె టిన్ను ధర రూ.2100లు దాటింది. ఇక రిటైల్ మార్కెట్‌లో కిలో పామొలిన్ నూనె రూ.155లకు చేరింది. ఇక సన్ ఫ్లవర్ అయిల్స్ లీటరు అంటూ పాకెట్(900 గ్రాములు) రూ.170లకు చేరింది. వెల్లులి(తెల్లగడ్డలు) ధర రూ.200లకు చేరింది.వేరుశెనగ పప్పు ధర కిలో రూ.120 నుంచి రూ.200లకు పెరిగింది. గతంలో ఈ ప్రాంతాల్లో వేరుశెనగ విస్తారంగా పండించే వారు. కానీ తెగుళ్ళ బాధలను తట్టుకోలేని రైతులు వేరుశెనగను పండించటం మానేసారు.దాంతో సరకులను మహారాష్ట్ర నుంచి తెప్పించుకోవాల్సి వస్తుంది. దాంతో ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. అయితే ఈ ధరలు నిలకడ లేదు.రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ధరలను అదుపు చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. కూరగాయల ధరలు అదుపులో ఉండగా నిత్యావసర సరకుల ధరలు పెరుగుతూ సామాన్యుని సతమతం చేస్తున్నాయి. కొత్త పప్పులు మార్కెట్‌లో వచ్చే సమయంలో ధరలు పెరగుదల ఏమిటో టోకు వ్యాపారులకు కూడా అంతుపట్టడం లేదు.ప్రభుత్వం రేషన్ షాపుల్లో కొంత కాలం కందిపప్పును అందించారు. కానీ అది అస్తవ్యస్తంగా మారింది. ఇక రేషన్ షాపుల్లో అందిస్తున్న కందిపప్పు నాసిరకంగా ఉందంటూ వినియోగదారులు కొనుటం లేదు.

## రెండు ఎంపిపి స్థానాలకు రేపు ఎన్నికలు

*చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా వున్న రెండు ఎంపిపి స్థానాలకు బుధవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి ఎన్నికలు నిర్వహించడానికి ఎలక్షన్ కమీషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బి.కొత్తకోట, గుడిపాల మండల ఎంపిపి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండు ఎంపిపి స్థానాలు గతంలో వైకాపా చేతిలో వుంటే అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఎంపిపి స్థానాలను సైతం తన గుప్పిట్లో పెట్టుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బి.కొత్తకోట, గుడిపాల మండల ఎంపిపి పదవులు ఖాళీ అయ్యాయి. ఖాళీ అయిన ఎంపిపి కుర్జీలకు బుధవారం ఎన్నిక నిర్వహించాలని ఎలక్షన్ కమీషన్ ఆదేశించింది.*

## కన్నులపండువగా దోపోత్సవం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజు ఓఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ఈ నేపధ్యంలో సోమవారం ఆలయంలో దోపు ఉత్సవాన్ని నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలకు సంబందించి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అయితే ఈ వస్త్రాలను కొందరు దొంగలు దోచుకుపోవడంతో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన తొండమాన్ చక్రవర్తి మారువేషంలో వెళ్ళి పట్టువస్త్రాలను తిరిగి తీసుకువచ్చి స్వామి అమ్మవార్లకు అందిస్తారు. దీనినే దోపోత్సవం అంటారు. పురాతన కాలం నుంచి ఆలయంలో ప్రతి ఏడాది ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆలయంలోని అలంకారమండపంలో స్వామిఅమ్మవార్లతో పాటు తొండమాన్ చక్రవర్తిని ప్రత్యేకంగా అలంకరించి సప్పరాలపై ఆశీనుల్నిచేసి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, సుదర్శనం, అర్చకులు రామకృష్ణశర్మ,పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

# గుడిపాల ఎంపిపి కుర్చీకి రేపు ఎన్నిక

**- ఎన్నికల అధికారిగా చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు**
**పరిశీలకులుగా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్**

చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గుడిపాల మండల పరిషత్ అధ్యక్ష కుర్చీకి బుధవారం 11 గంటలకు గుడిపాల ఎంపిడిఓ కార్యాలయ అవరణలోని సమావేశభవనంలో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎంపిపి ఎన్నికకు ఎన్నికల అధికారిగా చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఎంపిడిఓ శిరీష, ఎన్నికల పరిశీలకులుగా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్‌లను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో నాలుగేళ్ళ క్రితం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా జరిగిన ఎంపిటిసీ ఎన్నికల్లో గుడిపాల మండలంలో వైకాపా జెండా ఎగిరింది. గుడిపాల మండలంలో మొత్తం 12 ఎంపిటిసీ స్థానాలు వుండగా అందులో 10 వైకాపా, 2 తెలుగుదేశం పార్టీలు దక్కించుకున్నారు. మెజార్టీ ఎంపిటిసీ స్థానాల్లో విజయం సాధించిన వైకాపా ఎంపిపి అభ్యర్థిగా ప్రసాద్‌రెడ్డిని ఎంపిక చేసింది. ఆ మేరకు ప్రసాద్‌రెడ్డి ఎంపిపిగా ఎన్నికయ్యారు. అయితే రెండేళ్ళ క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం తారుమారైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలుకాగా, తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో అధికారం చేజిక్కించుకుంది. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా తెలుగుదేశం నుండి గురజాల జగన్మోహన్‌నాయుడు విజయం సాధించారు. గురజాల జగన్మోహన్‌నాయుడు సొంత మండలం గుడిపాల కావడంతో తన మండలంలో ప్రతిపక్ష వైకాపా అధికారంలో వుండటంతో ఆయన పావులు కదిపారు. ఈ మేరకు మెజార్టీ వైకాపా ఎంపిటిసీలను తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చేలా వ్యూహాలు రచించి అమలు చేశారు. ఆరు నెలల క్రితం నిర్వహించిన అవిశ్వాస తీర్మానంలో వైకాపా ఎంపిటిసీల్లో అత్యధికులు తమ పార్టీ ఎంపిపిగా వున్న ప్రసాద్‌రెడ్డికి అవిశ్వాస తీర్మానంలో ఓటు వేయలేదు. ఈ క్రమంలో అవిశ్వాస తీర్మానంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి ఓటమిపాలు కావడంతో ఎంపిపి సీటు ఖాళీ అయ్యింది. ఎలక్షన్ కమీషన్ రాష్ట్రంలో ఖాళీగా వున్న ఎంపిపి స్థానాలకు ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీ చేసింది. ఈ మేరకు గుడిపాల మండల ఎంపిపి పదవికి బుధవారం ఎన్నిక జరుగనుంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచే గోళ్ళహరిప్రసాద్ చౌదరి ఎంపిపి అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## వైభవంగా పేట ఉత్సవం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి02 ప్రభాతవార్త: తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి పేట ఉత్సవం సోమవారం పండవుగా నిర్వహించారు. మాఘ పౌర్ణమి మరుసటిరోజు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను తిరుపతి సమీపంలోని కూపుచంద్రపేట గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీ. ఉదయం 6గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు ఊరేగింపుగా బయలుదెరి, తిరుపతికి 8కిలోమీటర్ల దూరంలో గల కూపుచంద్రపేటకు చేరుకుంది. అక్కడ ఉదయం 10 నుండి 11:30 గంటల వరకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనే, పసుపు, చందనంతో స్వామి అమ్మవార్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి ఆలయానికి చేరుకున్నా రు. స్వామి ఊరేగింపులో టిటిడి హిందూ ధర్మ ప్రచారపరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై టిడిపి నేతల హర్షం



తిరుపతి,పిబ్రవరి 2ప్రభాతవార్తప్రతినిధి: ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత పురోగతికి నిధులు కేటాయించడం అభినందనీయమని టిడిపి పార్లమెంట్ కమిటీ నేతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్‌లో ఆశించిన రీతిలో ప్రాధాన్యత కల్పించిందని, ఇది రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎంతగానో తోడ్పడుతుందని పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ప్రధాన కార్యదర్శి సి.దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు..తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మీడియా సమావేశంలో వారిరువురూ రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపు , పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్రం చూపుతున్న చొరవ హర్షణీయమన్నారు. ఈ మీడియా సమావేశంలో టిడిపి నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, బి.శ్రీధర్‌వర్మ, సదాశివం, యశ్వంత్ రెడ్డి, ఆర్ సి ముని కృష్ణ, ఊకావిజయ కుమార్, జెబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సమస్యలపై తక్షణం పరిష్కరించండి

### -ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ మౌర్య



తిరుపతి,పిబ్రవరి 2ప్రభాతవార్త: ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై అధికారుల సత్వరం స్పందించి పరిష్కరించాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయి. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. 26మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్,డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

### సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో

## వేడుకగా సిల్వర్ జూబ్లీ సంబరాలు



నారాయణవనం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : పుత్తూరు సమీపం నారాయణవనంలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గత 6 రోజులుగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరుగుతున్నది. సోమవారం ఆరవరోజు వివిధ బ్రాంచీలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో అసోషియేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలల అధినేత డాక్టర్ కొండూరు అశోకరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విద్యార్థులతో నిర్వహించిన కాంపిటేషన్స్‌ను నిర్వహించారు. ఈ కాంపిటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి అసోషియేషన్ కార్యక్రమం జరిగింది. 13 ఇంజనీరింగ్ బీటెక్ బ్రాంచీలు వాటితో పాటు ఎంబీఎ, ఎంసిఎ బ్రాంచీలలో పవర్ పాయింట్ పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, జస్ట్ ఏ మినిట్, మిని ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ డీబగ్గింగ్, లోగో కాంపిటేషన్, వర్డ్ షజిల్, ప్రోమో తదితర పోటీలు నిర్వహించారు. కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల, విద్యార్థులు వ్యక్తిగతంగా మరియు టీమ్ వర్క్‌తో భవిస్యత్తులో ఎదగడానికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే విద్యా కోర్సులలో తమ ఉనికిని చాటుకోవడానికి ప్రాథమిక బీజం వేస్తుందన్నారు. అలాగే అసోషియేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు అభినందిస్తూ ప్రతి పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందిన వారికి షీల్డ్, ప్రశంసాపత్రాలను బహుకరించారు. అనంతరం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మధు, జనార్ధన్‌రాజు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అందరు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు దుర్మరణం





నాగలాపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మండలంలోని కృష్ణాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. సోమవారం వేకువ జామున చెన్నై వైపు నుంచి తిరుపతి వైపుకు బైక్‌కి వెళుతున్న నింద్ర దళితవాడకు చెందిన నాగరాజు సోనూ(20), రామగిరి గ్రామానికి చెందిన సంజయ్ వాళ్లిద్దరు మిత్రులు తమిళనాడులోని అమెజాన్ సంస్థలో పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి నాగలాపురం పట్టణంలోని కల్యాణ మండపంలో ఓ వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో అతి వేగంగా బైక్ నడిపి రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టును బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తలమీ బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి చెందారు. అనంతరం సాయంత్రం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాన్ని నాగలాపురం ఎస్ఐ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్అండ్‌బీకి ఫోన్ ద్వారా డీఎస్పీ సమాచారాన్ని తెలియజేసి ఈ ప్రదేశాన్ని డేంజర్ జోన్‌గా తీసుకుని స్పీడ్ బ్రేకర్లను వేయాలని కోరారు. సంఘటనా స్థలంలో నాగలాపురం ఎస్ఐ సునీల్, కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### రోడ్డున పడ్డ కుటుంబం



కార్వేటినగరం,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కార్వేటినగరానికి అతి సమీపంలో జరిగిన వాహనాల ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది.తిరుపతి జిల్లా తిరుచానూరు సమీపంలోని ముద్లపూడి గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు శంకర్‌రెడ్డి (32) కార్వేటినగరం కాశాతోటవీధిలో కాపురంయుండు అములు కుమార్తె ఉషతో 7ఏళ్ళ క్రితం వివాహమైంది. వీరికి పేక్షిత్‌రెడ్డి(6),చారురెడ్డి(4)లు అనే ఇద్దరు అబ్బాయిలు కలరు.శంకర్‌రెడ్డి తిరుపతి రూరల్ పద్మావతిపురం లోని పంచాయితి కార్యాలయంలో డేటా ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తుంది.కార్వేటినగరంలో ఓ అద్దె ఇంట్లో కాపురం వుంటున్నారు.సోమవారం తిరుపతి కార్యాలయానికి విధులకు వెళ్ళి మద్యాహ్నం కార్వేటినగరంలోని ఇంటికి స్కూటీపై తిరుగుప్రయాణం ప్రయాణమయ్యాడు.పల్లిపట్టు నుండి పుత్తూరు వైపు వెళ్తున్న బొలొరో వాహనం కార్వేటినగరానికి వస్తున్న శంకర్‌రెడ్డి అనే యువకుడిని ఢీకొనడంతో అక్కడిక్కడే సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు.మృతుడు శంకర్‌రెడ్డి హెల్మెట్ ధరించినా ప్రమాదంలో మృత్యువాత తప్పక పోవడం గమనార్హం.కార్వేటినగరం పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వఆసుపత్రి శవపరీక్ష నిర్వహిస్తున్నారు.కార్వేటినగరం ఎస్ఐ తేజస్విని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 4న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి యువకులకు ఈ నెల 4న భారీ ఎత్తున జాబ్‌మేళా నిర్వహించుటకు నిర్ణయించినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సోమవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశం కల్పించుటకు ప్రతి ఒక్కరు ఉపాధితో ఉండాలనే లక్ష్యంతో 12కుపైగా మల్టీ నేషనల్ కంపెనీల సౌజన్యతో జాబ్‌మేళా నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 4 బుధవారం ఉదయం 8.30గంటల నుంచి ప్రారంభమౌతుందని వివరించారు.

## డిజిటల్ పాస్ బుక్స్ పంపిణీ



ఏర్పేడు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ఏర్పేడుమండలంలో ఎమ్మార్వో కార్యాలయం వద్ద సీతారాంపేట పంచాయతీ వెంకటాపురం రైతులకు "డిజిటల్ పాస్ బుక్స్ "పంపిణీ ఎమ్మార్వో భార్గవి పంపిణీ చేశారు. ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయచైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి, టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, నైనూరు పోన్నారావ్, శివశంకర్ రెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ మహేష్ రెడ్డి, సూరి నాయుడు , బాబు నాయుడు, క్రిష్ణవేణి,రాఘవేంద్ర,గుణాయాదవ్, రాచటి సుబ్రహ్మణ్యం, కేశినేని సుబ్రహ్మణ్యం,నాగేశ్వరావు,శీను,వెంకటయ్య,సుబ్రహ్మణ్యంరెడ్డి,మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం



శ్రీకాళహస్తి ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ఈ నెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్షకార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు.ఐఎఫ్టియు కార్యాలయంలో అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరించేలా వ్యవహరిస్తోందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో సాధించుకున్న కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లకు కుదించిందన్నారు.. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్త కార్మిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిందనీ,కార్మిక వర్గమంతా ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు గంధం మణి, కుమార్, వేణు,నాయకులు జాకీర్, జిల్లా అధ్యక్షురాలు భారతి, మున్వర్ .ఏఐటీయూసీ నేతలు కత్తి రవి, మల్లి పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబానికి చేయూత



తొట్టంబేడు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త తొట్టంబేడు మండలం పూడి గిరిజన కాలనీలో ఒక కుటుంబం కొద్దిరోజుల క్రితం తమ ఇల్లు కాలిపోవడం వల్ల ఇంట్లో ఉన్నటువంటి అన్ని వస్తువులు దగ్ధం అయిపోయాయి. ఈ ప్రాంతాల్లో జనసేన పర్యటన చేసినప్పుడు పాత్ర సామానులు, సిలిండర్ తో పాటు అన్ని దగ్ధమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన జనసేన తొట్టంబేడు మండల పార్టీ నాయకులు పేట బ్రదర్స్ మిత్రబృందం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సోమవారం జనసేన సారథ్యంలో ఆ కుటుంబానికి సహాయంగా నిలబడుతూ గ్యాస్ సిలిండర్, పాత్ర సామాన్లు, నిత్యవసర సరుకులు,అందించారు, గిరిజన కాలనీవాసులు బాధిత కుటుంబానికి చూపించినటువంటి సహాయక చర్యలను చూసి సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, జానీ,గంధం శీను, కల్లిపూడి వెంకటేష్, నాదెండ్ల రాజేష్, ప్రదీప్ కుమార్, మనీ, నవీన్, లక్ష్మణ్, హరి, డాక్టర్ నక్క ప్రసాద్, మహేష్, పసల సురేష్, పసల ఎలిషా, ముని చంద్ర, రమేష్‌బాబు,శాంతికుమార్,నాగరాజు,చందు,గోపి,సాయి, మరియు గిరిజన కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి.. సి.ఐ.టి.యు



తొట్టంబేడు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలంటూ సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో సోమవారం చియ్యవరం, బసవయ్య పాలెం, కంచనపల్లి, చిట్టత్తూరు గ్రామ సచివాలయాల ఎదుట ఉపాధి హామీ కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు.అనంతరం సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రం అందజేశామని సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఎంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వి.బి.జి.ఆర్.ఏ.ఏం నూతన చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉపాధి హామీ కూలీలకు అండగా నిలబడి పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ బాధ్యులు గంధం మణి, డప్పు కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, సి.ఐ.టి.యు నాయకులు రాపూరు సుబ్రమణ్యం, గురునాథం, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం లో ఆండ్రాయిడ్ రోబోటిక్స్ విజేతలకు సన్మానం



శ్రీకాళహస్తి ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ఎంజీఎం పాఠశాలలో సోమవారం ఆండ్రాయిడ్ రోబోటిక్స్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేసారు. పాఠశాల నిర్వాహకులు గుడ్లూరు మయూర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ సన్మానం జరిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్ ఫలితాల్లో ప్రైమరీ క్యాటగిరీలో 4 క్లాస్ టీమ్ 5 మంది విన్నర్స్ 5 క్లాస్ టీమ్ 5 మంది రన్నర్స్, అదేవిధంగా మిడ్ క్యాటగిరిలో 6 క్లాస్ టీమ్ 5 మంది విన్నర్స్ 7 క్లాస్ 5 మంది రన్నర్స్,హయ్యర్ కేటగిరీలో 9 క్లాస్ టీమ్ 5 మంది విన్నర్స్ 8 క్లాస్ టీమ్ 5 మంది రన్నర్స్ అయ్యారు. వారిని అభినందించారు.ఇక్కడ ఎంపికైన వారు చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయిలో 300 స్కూల్ తో కలిపి వీరికి క్విజ్ కాంపిటీషన్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ మా స్కూల్ నుండి 30 మంది విద్యార్థులు ఆండ్రాయిడ్ రోబోటిక్ లో సెలెక్ట్ అయ్యి చెన్నైలో నేషనల్ లెవెల్ లో జరుగు దాదాపు 300 స్కూల్స్ పాల్గొనబోయే విద్యార్థులతో పోటీ పడుతున్నందుకు సంతోషంగా ఉందని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం స్కూల్ హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడుఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నవ్యాంధ్రకు బాసటగా కేంద్ర బడ్జెట్



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 2 ప్రభాతవార్తకేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాసటగా ఉందని తెలుగుదేశం బిసి విభాగం నాయకులు అభినందించారు. సోమవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి బాసటగా నిలిచిన చంద్రబాబునాయుడు పరిపాలనకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటూ నిధుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించిన అంశాల్లో మరింతగా దూకుడు పెంచుకునేందుకు బాసటగా బడ్జెట్ కేటాయింపులున్నాయని వివరించారు.బడ్జెట్‌లో డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్,హైస్పీడ్ రైల్ కారిడార్,పోలవరం ప్రాజెక్టుకు ఆర్థిక భరోసా, డేటా సెంటర్‌కు పన్నుల నుండి ఉపశమనం,పర్యాటకానికి ఊతం అమరావతి అభివృద్ధికి అండ, ఇలా ఎన్నో అంశాలు రాష్ట్ర పురోభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా వనరులు కేటాయించటం అభినందనీయం అన్నారు. ఈ మీడియా సమావేశంలో తెలుగుదేశం నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్‌రవి, తెలుగుదేశం పార్టీ బీసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్.యం ఉమేష్‌రావు, బీమాల భాస్కర్ ముదిరాజ్, వజ్రం కిషోర్ కోటచంద్రశేఖర్‌చిల్లకూరు మణి, మురళినాయుడు, గంగనపల్లి రమేష్,కృష్ణమూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## కాలువపై అక్రమ కట్టడాలు



తొట్టంబేడు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పట్టణానికి ఆనుకుని ఉన్న తొట్టంబేడు మండలం బసవయ్య పాలెం, కన్నలికి మధ్యలో సర్వే నెంబర్ 228/7 లో ఓ రైస్ మిల్లు వద్ద కాలువపై అక్రమంగా కట్టడాలు చేస్తున్న ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ కట్టడం కింద కాలువ నిర్మాణం ఉంది. ఇందులో మురికినీరు ప్రవహించడానికి వీలు లేకుండా అలాగే నిల్వ చేరి దోమలు,కీటకాలకు నిలయంగా మారింది. ఈ సమస్యను అక్కడివారు పంచాయతీ కార్యదర్శికి విన్నవించిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అక్రమార్కులు చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారుతాయని అంతా భావించారు. అయితే ఈ ప్రభుత్వంలో కూడా అక్రమార్కులకు అదుపు లేకుండా పోతోంది. దీనిబట్టి చూస్తే తొట్టంబేడు మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతుందని అర్థమవుతుంది. రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని బసాయపాలెం వాసులు వాపోతున్నారు.

## డాలర్ దివాకర్‌రెడ్డికు ఘన సన్మానం



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : తిరుపతి టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులకు కమ్యూనిటీ హాల్ మంజూరుకు సానుకూలంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్పందించారని 2 వీలర్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు సభ్యులు టూ వీలర్స్ మెకానిక్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువజనోత్సవాలలో ఎస్ జి ఎస్ విద్యార్థుల ప్రతిభ.



తిరుపతి విద్య, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ఢిల్లీ వేదికగా వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల సెట్విన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవాలలో ఎసీఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు, ప్రశంసాపత్రాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ, అధ్యాపకులు ఘనంగా అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన నృత్య పోటీలలో కళాశాల విద్యార్థులు జానపత నృత్య పోటీల విభాగంలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాదన్న, అధ్యాపకులు కొండలరావు, డాక్టర్ కోటీశ్వరయ్య, ఉదయ్, జగదీష్ కుమార్, చంద్రయ్య, భాస్కరన్, శివకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు రోజులలో ఫీజులు తగ్గిస్తాం.



తిరుపతి విద్య ఫిబ్రవరి 2 ప్రభాత వార్త ఎస్వీయూలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజులు తగ్గించాలని కోరుతూ పరిపాలనా భవనం ఎదుట రెండు రోజుల పాటు ధర్నా నిర్వహించారు. సోమవారం వీసీ చాంబర్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం రెక్టార్ అప్పారావును కలిసి వినతిపత్రం అందజేశారు. బీఈడీ ఫీజల విషయంలో ఈసీ సమావేశంలో చర్చించి రెండు రోజులల్లో తగ్గించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని విరమించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 10 శాతం చొప్పున ఫీజులు పెంచుతూ విద్యార్థులపై భారం మోపడం అన్యాయమని, ఇకపై ఇలాంటి నిర్ణయాలను సహించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో లేనివిధంగా ఎస్వీయూలో మాత్రమే బీఈడీ పరీక్ష ఫీజులు రూ. 2118లు వసూలు చేయడం దారుణమని విమర్శించారు. రెక్టార్ ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ అశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, యూనివర్సిటీ కార్యదర్శి నరసన్నతో పాటు నాయకులు మహేష్ బాబు, తిప్పేస్వామి, మణి, అంజి, బాష, ప్రకాష్, లక్ష్మీ పెద్ద సంఖ్యలో బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సురేంద్రకు వాగేశ్వరి తెలుగు సేవా పురస్కారం



తిరుపతి విద్య, ఫిబ్రవరి 2 ప్రభాత వార్త తెలుగు కళా రత్నాల సాహితీ సేవ సంస్థ, ఉషోదయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ పాటూరు సురేంద్రబాబు కు వాగేశ్వరి తెలుగు సేవ పురస్కారం ప్రదానం చేశారు. స్థానిక అంబేద్కర్ భవన్లో జరిగిన కార్యక్రమంలో మూడు దశాబ్దాలుగా జర్నలిస్టు రంగంలో సేవలందిస్తున్న సురేంద్రకు అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు యూవీ రత్నం, ఉషారాణి మాట్లాడుతూ మరుగున పడుతున్న జానపదం కలలను బతికించాలని ఉద్దేశంతో, నిత్యం ఇలాంటి ప్రతిభ పురస్కారాలను ఎంతో శ్రమ కోర్చి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు గ్రహీత సురేంద్రబాబు మాట్లాడుతూ కవులు రచయితలు సాహితీప్రియులు పాత్రికేయులు తమ రచనలు వ్యాసాల ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తున్నారని, అలాంటి వారికి సత్కారం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పరమ శివన్, మోహన్ రెడ్డి, ప్రముఖ రచయితలు, సాహితి ప్రియులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించారు

తిరుపతి విద్య, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త కేంద్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, విద్యారంగానికి నిధులు కేటాయించకుండా పూర్తిగా విస్మరించారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు పవిత్ర, అక్బర్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యపై జీడీపీలో 6 శాతం ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కేవలం 0.3 శాతం మాత్రమే కేటాయించడం రాష్ట్ర విద్యార్థులకు తీవ్ర నష్టం జరగనుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు దాదాపు 80 వేల పాఠశాల లు మూసివేత, విలీనం చేసి పేద విద్యార్థులను బడి దూరం చేశారని మండిపడ్డారు. రాష్ట్రం లోను అదే పరిస్థితి కొనసాగుతోందని, ఉపాధ్యాయ నియామకాల అవసరం మేరకు లేకపోవడం గ్రామీణ పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు, పెరుగుతున్న డ్రాప్‌అవుట్లు రాష్ట్ర ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రైవేటీకరణ విధానాలు రాష్ట్రంలో విద్యను మరింత బలహీనపరుస్తున్నాయని, కార్పొరేట్లకు లాభాలు సమకూర్చేలా విద్యార్థుల గొంతులు కోసే విధంగా ఉందని, ఇప్పటికే రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగం బలోపేతం చేయడానికి తగిన నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రెండవ విడత జేఈఈ మెయిన్స్ కు దరఖాస్తులు

తిరుపతి విద్య ఫిబ్రవరి 2 ప్రభాత వార జేఈఈ మెయిన్స్ పరీక్షకు సంబంధించి రెండవ విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ఆదివారం నుంచి ప్రారంభమైనట్లు ఎన్టీఏ అధికారులు ప్రకటించారు. ఈనెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 2వ తేదీ నుంచి 9వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత నెల 29వ తేదీతో ముగిసిన జేఈఈ మెయిన్స్ తొలివిడత పరీక్షలకు తిరుపతి జిల్లా నుంచి సుమారు 10,257 మంది హాజరయ్యారు.

## వృద్ధి,ఉత్పాదకత,ఉద్యోగాలపై బడ్జెట్ దృష్టి

ఎస్వీయు ప్రొఫెసర్ జి.అంజన్ బాబు



తిరుపతి విద్య ,ఫిబ్రవరి 2 ప్రభాత వార్త దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలైన చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యాపారాభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్లో పలు ప్రోత్సాహక చర్యలు చేపట్టారని ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ తెలియజేశారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి న్యూబాలాజి కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో బడ్జెట్2026పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో భాగ్యతేజ కీలకోపన్యాసం చేస్తూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ను ప్రోత్సహించేందుకు 10 వేల కోట్లతో గ్రోత్ ఫండ్ ను ఏర్పాటు చేశారని చెప్పారు. కార్పొరేట్ మిత్ర పేరుతో వృత్తి నిపుణులను తయారు చేసేందుకు ప్రభుత్వం పలు సంస్థలను ఏర్పాటు చేయనుందని వివరించారు. సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో 10 లక్షల రూపాయల కన్నా ఎక్కువ నగదు డిపాజిట్ చేస్తే పన్ను పరిధిలోకి వస్తారని సూచించారు. ఎస్వీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ జి.అంజన్ బాబు మాట్లాడుతూ డిజిటల్ సార్వభౌమాధికారం ద్వారా చిప్ ల తయారీ, ఇతర సాఫ్ట్వేర్లు తదితరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వదేశంలోనే వాటిని ఉత్పత్తి చేసేందుకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించారని చెప్పారు. పిఆర్ఎస్ఐ తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.జయచంద్రారెడ్డి, చాప్టర్ ఛైర్మన్ డా.జిఎస్.ప్రసాద్, సెక్రటరీ దుద్యాల చంద్రమోహన్, కె.శ్రీనివాసరావు, కె.మధుసూదన్, సంస్కార్ రాజేష్, కార్యవర్గ సభ్యులు డా. సి.స్వరాజ్యలక్ష్మి, ఆర్సీ కె రాజు, వి.వి.సుబ్రహ్మణ్యం, సభ్యులు రవీంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

## 17నుంచి అంబేద్కర్ ఓపన్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు.

తిరుపతి విద్య ఫిబ్రవరి 2 ప్రభాత వార్త అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేస్తున్న విద్యార్థులకు ఈనెల 17వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు అంబేద్కర్ వర్సిటీ అధ్యయన కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వర్సిటీ నుంచి షెడ్యూల్ విడుదలైనట్లు ఆయన పేర్కొన్నారు. డిగ్రీ థర్డ్ ఇయర్ 5వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 17 నుంచి 22వరకు, సెకండ్ ఇయర్ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24 నుంచి వచ్చేనెల 2వ తేదీవరకు, ఫస్ట్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు వచ్చేనెల 4వ తేదీ నుంచి 10వ తేదీవరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

## ఇంటర్ ప్రాక్టికల్‌కు 179 మంది గైర్హాజరు.

తిరుపతి విద్య, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ రెండవ రోజు పరీక్షకు 179 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 90 పరీక్షా కేంద్రాలలో జరిగిన ప్రాక్టికల్స్ కు 5275మంది గాను 5177 మంది విద్యార్థులు, మధ్యాహ్నం 90 కేంద్రాలలో జరిగిన పరీక్షకు 4661మందికి గాను 4580 మంది హాజరయ్యారని తెలియజేశారు. రెండవ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లా ఎస్పీని సత్కరించిన జడ్పీటీసీ సుమన్‌కుమార్



నారాయణవనం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ సోమవారం తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్పీని దుశ్శాలువతో సత్కరించారు.

## జవాబుదారి అధికారికి అవార్డు



తొట్టంబేడు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త తొట్టంబేడు మండలాభివృద్ధికి జవాబుదారి తనంతో పని చేస్తున్న అధికారి ఎంపిడిఓ సురేంద్రనాథ్ అని ఉన్నం వాసుదేవనాయుడు అన్నారు. సోమవారం ఆయన్ను మండల పరిషత్ కార్యాలయంలో కలసి సత్కరించారు.ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న తొట్టంబేడు మండల ఎంపీడీవో పి . సురేంద్రనాథ్ ను తొట్టంబేడు మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, ఉమ్మడి చిత్తూరుజిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.శ్రీకాళహస్తిరూరల్‌మండలం రామాపురంసర్పంచ్,శ్రీకాళహస్తినియోజకవర్గం పంచాయతీరాజ్ వింగ్ కన్వీనర్ పుట్టంరెడ్డి బాలిరెడ్డి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని సిపిఐ డిమాండ్



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే కేంద్రప్రభుత్వ యత్నాలను వెంటనే విరమించుకోవాలని సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిరూరల్ మండలం ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో విశ్వనాథ్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ పేరుతో అమలైతున్న ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి, నిధులు తగ్గించి క్రమంగా నిర్వీర్యం చేయడం దుర్మార్గమని విమర్శించారు. పథకానికి పూర్తిస్థాయి నిధులు కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. పాత చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకం రద్దయితే దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాల జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అనంతరం ఎంపిడిఓ దయాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు నైనార్ శ్రీనివాసులు ఘన సన్మానం



తిరుపతి కలెక్టరేట్ , ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 2 పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలు పొందిన రవి ,మహేష్, సువర్ణ , సాయిరాం , బాలాజీ , చైతన్ , విజయ్ , మోహన్ లనుమాజీ ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డైరెక్టర్ నై నార్ శ్రీనివాసులుతనకార్యాలయంలోవారికిశాలువాపుష్ప గుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు కనిపించే దేవుడు....



రేణిగుంట ఫిబ్రవరి 2 ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిపించే దేవుడని ఏపీపీఎస్సీ గ్రూప్ 2 అభ్యర్థులు చేతులు జోడించి అన్నారు. గత రెండు నెలల క్రితం రేణిగుంట మండలం జి పాలెం పంచాయితీ కొలనరి యూనివర్సిటీకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ఏపీపీఎస్సీ గ్రూప్ 2 విద్యార్థులు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సహకారంతో వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంపై స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏపీపీఎస్సీ గ్రూప్ 2 ఫలితాలను సంబంధిత అధికారులను ఆదేశించి విడుదల చేయించారు. అభ్యర్థులకు ఉద్యోగాలు రావడంతో ఆనందంగా సోమవారం రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావును కలిసి ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పరీక్ష ఫలితాలు విడుదల కావడానికి చంద్రబాబు నాయుడు చేసిన సహాయం జీవితంలో మర్చిపోలేమన్నారు. మానవతా దృక్పథంతో చంద్రబాబును కలవడానికి అవకాశం కల్పించిన డిఎస్పి శ్రీనివాసరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ధన్యవాదాలు తెలిపిన వారిలో తిరుపతికి చెందిన మల్లెల మహేష్,నెల్లూరుకుచెందినరవి,సాయిరాం,సత్యసాయి జిల్లా కదిరికి చెందిన విజయ్ కుమార్, ఉన్నారు..

## పిల్ల పాలెం రేషన్ షాపును తాహసిల్దార్ ఆకస్మిక తనిఖీ



రేణిగుంట ఫిబ్రవరి 2 ప్రభాతవార్త రేణిగుంట మండలం పిల్లపాలెం రేషన్ షాప్ 38 ను రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, తూకాలను పరిశీలించిప లబ్దిదారులందరికీ రేషన్ సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఇది ఇలా ఉండగా పిల్ల పాలెం గ్రామంలో ఇటీవల సర్వే నిర్వహిం చి తాత్కాలికంగా పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చిన రైతులకు వాటి స్థానంలో రాజముద్రతో శాశ్వత కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను తాహసిల్దార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో రామ్మూర్తి, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు,చెర్లోపల్లి సుబ్రమణ్య రెడ్డి స్థానిక టిడిపి నేతలు, రైతులు పాల్గొన్నారు.

## వరి సాగుపై రైతులకు శిక్షణ, విత్తనాల పంపిణీ.

రేణిగుంట ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్య పురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో న్యూఢిల్లీ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో సోమవారం బయోఫ్లోరైడ్ వరిసాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ డి ఆర్ ఆర్ దాన్ 48, ఎన్ ఎల్ ఆర్ 3238 వరి విత్తన సాగుపై అవగాహన కల్పించారు. రైతులకు విత్తన శుద్ధి మందు, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దివ్య, అనూష, దివ్య సుధ, అనిల్ కుమార్, అభ్యుదయ రైతు నాగేశ్వరరావు వివిధ మండలాల నుంచి రైతులు పాల్గొన్నారు.

## మామిడి సాగులో నూతన అధ్యాయం ప్రారంభం



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : రాష్ట్రీయ సేవా సమితి (రాస్) వారు కోకోకోలా ఇండియా ఫౌండేషన్, న్యూ డిల్లీ వారి సహకారంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడిలో సమగ్ర అభివృద్ధి తద్వారా నాణ్యమైన మామిడి ఉత్పత్తులు సాధించటం లక్ష్యంగా చేపడుతున్న "ఉన్నతి మ్యాంగో" పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కుప్పంలోని తన నివాసంలో నిన్న జరిగిన కార్యక్రమంలో లాంఛనంగా ప్రారం బించినట్లు రాస్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం , రాస్ కె.వి.కె సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. రాస్ ప్రధాన కార్యదర్శి , రాస్ కె.వి.కె ఛైర్మన్ డా.ఎస్.వెంకటరత్నం, రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు వి. నాగరాజు రమేశ్ రెడ్డి పాల్గొన్నారు

## జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అలాగే కొనసాగించాలి : సీపీఐ

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం నరేగా పథకం కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్నది ఈ చట్టాన్ని అలాగే కొనసాగించాలని సీపీఐ పార్టీ రాష్ట్ర వ్యాప్త ప్రచారం ఆందోళనలో భాగంగా సోమవారం ఉదయం పుత్తూరు గ్రామీణ మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ పేదవాడికి ఉపాధి కల్పించడంపేరుతో పనేముందు అని తొలగించి కొత్త పేరు పెట్టడం వలన గ్రామీణ పేదలకు ఒరిగేదేముంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన జీ రాంజీ పథకం వల్ల ఉపాధిహామీ పథకం నీరుగారిపోతుందని రద్దు చేయబడుతుందని రాష్ట్రాన్ని భారం మోపుతున్నారని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, అర్జీలు సమర్పించడంలో భాగంగా పుత్తూరు ఎంపీడీవో శ్రీదేవికి వినతిపత్రం అందించారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, పుత్తూరు డివిజన్ కార్యదర్శి మహేష్, చంద్రబాబు, గోపి కృష్ణారెడ్డి, శరవణ, శేఖర్, సూరి, వెంకటాద్రి పాల్గొన్నారు.

## క్యాట్ లెవెల్-2 పరీక్షలో చైతన్య విద్యార్థుల ప్రతిభ



పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం స్వామివీధి శ్రీ చైతన్య పాఠశాలలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్ లెవెల్-2 పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఏజీఎం సురేష్ అభినందించారు. చదువుతో పాటు ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి గొప్పస్థాయికి ఎదగాలని ప్రోత్సహించారని ప్రిన్సిపాల్ శరవణ తెలిపారు. చైతన్య పాఠశాల నుంచి 63 మంది విద్యార్థులు క్యాట్ లెవెల్-2 పరీక్షలకు హాజరు కాగా 61 మంది ప్రతిభ కనబరచారు. 9 మంది విద్యార్థులు నగదు బహుమతితో పాటు బంగారు పతకం,సర్టిఫికెట్లు అందుకున్నారు. మిగిలిన 46 మంది విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్లతో అభినందించారు. కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ బాలాజీ, జోనల్ డీన్ సి.మోహన్, సీబ్యాచ్ ఇన్‌చార్జి కె.రూపావాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



కార్మిక చట్టాలు నీరు కార్చాలని, వీలైతే రద్దు చేయాలని, తమ వ్యాపారాలకు లాభాలకు ఎలాంటి ఆటంకం లేకుండా పెట్టుబడిదారులకు మేలు చేకూర్చేలా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబరు కోడ్‌లను కేంద్రం తీసుకువస్తోందని దీనికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు సమ్మె జయప్రదానికి కథం తొక్కాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యంలు అన్నారు. పుత్తూరు ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా ఉద్యోగ కార్మిక సంఘాల సమ్మె జయప్రదానికి కార్మిక వర్గాన్ని కదిలించాలని విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ పుత్తూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపి, చంద్రబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, సీపీఐ కార్యదర్శి మహేష్, కార్మిక సంఘం నాయకులు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమావతి, భాస్కర్, కృష్ణారెడ్డి, విజయకుమారి, విజయ్, మునికుమారి,శరవణ, మేస్త్రి బాషా, నరసింహులు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.28 లక్షల 12 వేలు



వెంకటగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి పరకామణి (హుండీ) ఆదాయం 143 రోజులకు గాను 28 లక్షల 12 వేలు 247 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయం ఈవో ఆర్వ భూమి వెంకట శ్రీనివాసరెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని పాతకోట వద్ద వెలసి ఉన్న శ్రీరామ మందిరంలో పోలేరమ్మ హుండీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయం ఈవో శ్రీనివాసులు, పోలేరమ్మ ఆలయం ఈవో పర్యవేక్షణలో లెక్కించారు. యూఎస్‌కు చెందిన 20 డాలర్లు, యూరో, కువైట్ దినార్‌లు కూడా హుండీలో వేసినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ సిబ్బంది, విశ్రాంత స్టేట్ బ్యాంకు ఉద్యోగులు, శ్రీ భ్రమరాంబిక సేవా సమితి స్వచ్ఛంద సేవకులు లెక్కింపులో పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## రేపు స్పెషల్ గ్రీవెన్స్ -క్లినిక్

వాకాడు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో బుధవారం స్పెషల్ గ్రీవెన్స్, క్లినిక్ కార్యక్రమం జరుగుతుందని, మండల తహసిల్దార్ సయుద్ ఇక్బాల్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాకాడు, చిట్టమూరు మండలాల నుండి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు కు ప్రజా సమస్యల మీద పరిష్కారం చూపబడుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్, సూళ్లూరుపేట ఆర్డిఓ వస్తున్నారన్నారు, ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

## అందరివాడికే మళ్లీ టీడీపీ అందలం



పెళ్లకూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవి మళ్లీ బీసీ వర్గానికి చెందిన సంచి కృష్ణయ్యనే వరించింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఒక సామాన్య కార్యకర్తగా ఉంటూ గ్రామ సర్పంచి స్థాయి నుంచి మండల అధ్యక్ష స్థాయికి అంచలంచెలుగా ఎదుగుతూ ప్రజల మన్ననలను పొందుతూ పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కృష్ణయ్య మొదటినుంచి పార్టీలో వివాదరహితుడుగా సౌమ్యుడుగా, అందరి వాడిగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడడం చూసి పార్టీ అధిష్ఠానం మళ్లీ కృష్ణయ్యకే పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ పగ్గాలు అప్పగించింది. నాకు ఈ పదవి రావడానికి కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, యువ నాయకుడు లోకేష్ బాబుకు, రాష్ట్ర అధ్యక్షులు పల్లాం శ్రీనివాస్ యాదవ్‌కు, మా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకు, నా దైవ సమానులు నెలవల సుబ్రహ్మణ్యంకు, మా నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్‌కు, రుణపడి ఉంటానన్నారు.

## విద్యార్థి దశ అత్యంత కీలకమైనది



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు తమ భవిష్యత్‌కు బంగారుబాట వేసుకునేందుకు వీలవుతుందని డాక్టర్ రజనీకాంత్ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆర్గనైజేషన్ ట్రైన్ టు బ్రెయిన్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజి పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థి గంపా నాగేశ్వరరావు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యానికి తగ్గట్లుగా సబ్జెక్టులను ఎంపిక చేసుకుని చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి



తడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: గ్రామీణ నిరుపేద ప్రజల జీవనాడి అయిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని తిరుపతి జిల్లా రైతు సంఘం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తడ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో కు వినతి పత్రం అందించారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ జి రామ్ జి చట్టంగా పేరు మార్చి పాత చట్టానికి తూట్లు పొడవడం గ్రామీణ నిరుపేదల బతుకులను చిన్నాభిన్నం చేయడమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ తడ మండల కార్యదర్శి ఓ కుమార్, శ్రీనివాసులు వెంకటేష్ చెల్లయ్య ఎలుమలై రాధాకృష్ణ, పలని, మూర్తి, శేఖర్,మనోహర్, సిహెచ్. రజిని తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా?



తడ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: వైసిపి నాయకులపై కూటమి నేతలు దాడులు చేసి చివరకు బాధితులపైనే కేసులు పెట్టే వికృత రాజకీయ క్రీడ రాష్ట్రంలో సాగుతోందని, ఇతరులకు ఏ భాష మాట్లాడాలో నీతులు చెప్పే అధికార పార్టీ నాయకులే నీతిబాహ్యంగా ప్రవర్తిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బోలింగాలపాడు జయ కుమార్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పుట్టుకపై నీచ వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుకు ఇతరులు ఎలా మాట్లాడాలన్నది నిర్దేశించే నైతిక హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## అధ్యక్షునికి అభినందనల వెల్లువ



పెళ్లకూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మండల టిడిపి అధ్యక్ష పదవి సంచి కృష్ణయ్యను రెండవ సారి వరించడంతో మండలంలోని తెలుగుదేశం శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెలువడుతున్నాయి. ఈ సందర్భంగా పలు పలువురు నాయకులు, కార్యకర్తలు సంచి కృష్ణయ్యకు అభినందనలు తెలియ జేస్తున్నారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కోట రమేష్ యాదవ్, మేకపిల్ల రవి, రాపూరు పరశురాం, మెరుం చంద్ర సంచి కృష్ణయ్యను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భూముల అక్రమణపై కలెక్టర్‌కు వినతి



పెళ్లకూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మండలంలోని ముమ్మారెడ్డి గుంట పంచాయతీకి చెందిన దళితులు సోమవారం నాడు తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో తమ భూములను పుల్లూరు పంచాయతీకి చెందిన కొంతమంది భూస్వాములు ఆక్రమించుకోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నాడు మమ్మారెడ్డి గుంట పంచాయతీకి చెందిన సుమారు 200 మంది దళితులు తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వారు కొద్ది రోజులుగా పోరాటం చేస్తున్న పుల్లూరు పంచాయతీలోని సర్వే నంబర్ 1 లో సుమారు 80 ఎకరాల భూమి మా పూర్వీకుల కాలం నుంచి మేము సాగు చేస్తున్నామన్నారు. ఇప్పుడు కొంతమంది భూస్వాములు కన్ను ఆ భూములుపై పడి ఆక్రమించుకుంటున్నారని కలెక్టర్‌కు విన్నవించుకోవడానికి వచ్చామన్నారు.

## .ఆటోనగర్ ఏర్పాటుపై ఆర్డీవోకు వినతి పత్రం



నాయుడుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మెకానిక్స్ అసోసియేషన్ యూనియన్ సభ్యులు నేడు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి కలిసి ఆటోనగర్ ఏర్పాటు చేయవలసిందిగా వినతి పత్రం సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి రోడ్డు పక్కన ఎటువంటి స్థిరమైన స్థలం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాము. నేడు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఖచ్చితమైన హామీ ఇచ్చారు. ఆర్డీవో ఆటోనగర్‌కు సహకరిస్తామని తెలిపారు. మా ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తున్న నాయకులకు, అధికారులకు కృతజ్ఞత తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్, నజీర్, కాలేషా, చిరంజీవి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

వెంకటగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: పేదలకు కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని వైసిపి ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ప్రజాల దగ్గరనుండి అర్జీలు స్వీకరించారు. వృద్ధాప్య, వితంతు, దయాలసిస్ పింఛన్లు 19 నెలలు గడుస్తున్నా ఇంతవరకు మంజూరు చేయలేదు అని తెలిపారు. నాయకులు అధికారులు ప్రతినెల పింఛన్ ఇవ్వడానికి వస్తున్నారు కానీ అవి అన్ని కూడా పాత పింఛన్లు మాత్రమే ఇస్తూ హడావిడి చేసి వెళుతున్నారు. కొత్త పింఛన్లు ఆన్లైన్లో వదలకుండానే నాయకులు ప్రచారం చేసుకున్నట్లు తెలిపారు. గత 6 నెలలుగా మునిసిపాలిటీ కి పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గవర్నమెంట్ తీసుకొంటుందని, అందువలన అభివృద్ధి పనులు సరిగా జరగడం లేదు అన్నారు.

## రాష్ట్రాల్లో రాష్ట్రపతి పరిపాలన విధించాలి : నేదురుమల్లి



వెంకటగిరి ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త) రాష్ట్రాల్లో శాంతిభద్రతల లోపించినందువల్ల వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రులైన జోగి రమేష్, అంబటి రాంబాబుల గృహాలను దగ్ధం చేసే అరాచకాలు సృష్టించారు అని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఈ సంఘటనల వల్ల భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. రాష్ట్ర గవర్నర్ రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేయాలని కోరారు.

## కేంద్రమే పూర్తిగా నిధులు ఇవ్వాలి




వెంకటగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకంకు విడుదల చేసే నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలని సిపిఐ వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి చిన్నం పెంచలయ్య తెలిపారు. ఉపాధి హామీ పథకం పేరును మార్చుకూడదని వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులతో కలిసి కూలీలు ధర్నా చేశారు. 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంపోస్ట్ కిట్లు పంపిణీ చేసిన కమిషనర్



నాయుడుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం నాయుడుపేట మున్సిపాలిటీ మెప్మా విభాగంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సహాయక సంఘ ఆర్పిలకు హోమ్ కంపోస్ట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్పీలు అందరూ వారి స్వయం సహాయక సంఘ సభ్యులకు, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి ఇచ్చేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం సురేంద్ర సిఒ లు నారాయణమ్మ, చెంచులత, ఆర్పిలు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్యపై న్యాయ విచారణ జరపాలి



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టర్ రేటు ముందు తిరుపతి ఉప్పరపల్లిలోని బిఎస్ఆర్ డిఫెన్స్ జూనియర్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి మృతిపై న్యాయ విచారణ జరిపి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ వెంకటేష్ గౌడ్,జిల్లా అధ్యకులు ప్రేమ్ సాగర్, ఎన్ ఎస్ యూ ఐ తిరుపతి సిటీ ప్రెసిడెంట్ షేక్ జావిద్ మాట్లాడుతూ జనవరి 22న చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం పాతగుంట గ్రామానికి చెందిన విద్యార్థి తులసి రెడ్డి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు.విద్యార్థి కళాశాల హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నప్పటికీ, కొన ఊపిరితో ఉన్న తులసి రెడ్డిని రుయా ఆసుపత్రికి చేర్చిన యాజమాన్యం పత్తా లేకుండా పారిపోయిందని, విద్యార్థి స్నేహితులే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారని చెప్పారు మరోవైపు విద్యార్థి మరణానికి కారణాలు బహిర్గతం చేయకుండా కళాశాల యాజమాన్యం కుటుంబానికి 11 లక్షల రూపాయలు ఇచ్చి సర్దుబాటు చేయడంలో కుట్ర ఉందని ,గత మూడేళ్లుగా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి అనుమతులు లేకున్నా కళాశాల నడుస్తోందని, ఆర్ఐఒ, అధికారులు నోటీసులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవడం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ సాగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు ఏ వంశీకృష్ణ ఎం హరికృష్ణ పురుషోత్తం చంద్రశేఖర్ నాయక్,ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌మన్సూర్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## ఎస్‌సివికి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



శ్రీకాళహస్తి ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వర మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు అతిధులను ఆహ్వానించే కార్యక్రమాల్లో ఆలయాధికారులు తలమునకలై ఉన్నారు. మొదట ఆలయాధికారులు స్థానికంగా ఉన్న నాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపధ్యంలో సోమవారం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్‌సీవి నాయుడుకు దేవస్థానం అధికారులు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేసి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఆలయ సూపరింటెంట్ నాగభూషణం యాదవ్ తదితర అధికారులు ఎస్‌సివి నాయుడును కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం వేద పండితులు ఎస్‌సివి నాయుడును ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు.

## డయల్ యువర్ సిఎండికి 50 వినతులు



తిరుపతి,ఫిబ్రవరి 2ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమా నికి 50 వినతులు అందాయని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. సంస్థ పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్లు, లోఓల్టేజ్ సమస్య, ట్రాన్సు ఫార్మర్ల సామర్థం పెంపు, విద్యుత్ స్తంభాల మార్పు తదితర సమస్యలు వీటిలో వున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా 50 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912 , 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్,ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ ,హెచ్‌ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్.పద్మ, కె.ఆది శేషయ్య, యం.మురళీ కుమార్, యం. ఉమాపతి, యం.కృష్ణారెడ్డి, కె.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, జనరల్ మేనేజర్లు సురేంద్రరావు, జగదీష్, చక్రపాణి, శ్రీనివాసులు, లలిత తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి ఐఐటిలో ఈ సమ్మిట్ 2026



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: తిరుపతి ఐఐటి ఏఐ ఫర్ సోషల్ గుడ్ హ్యాకథాన్‌ఖి ను ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 యొక్క అధికారిక ప్రీసమ్మిట్ ఈవెంట్‌ను రెండు రోజుల పాటు నిర్వహించింది. సోమవారం ముగింపు సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సమావేశంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆలోచనాత్మక ప్రసంగాన్ని అందించారు. తిరుపతి ఐఐటి దశల వారిగా జాతీయ స్థాయి గుర్తింపు కోసం పరుగులు తీస్తుందన్నారు.ఈ నెల 19,20తేదుల్లో న్యూఢిల్లీలో జరగనున్న ఇండియాఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026తో అనుబంధించబడిన అధికారిక ప్రీసమ్మిట్ ఈవెంట్ అయిన ఖిఏఐ ఫర్ సోషల్ గుడ్ హ్యాకథాన్‌ఖిను నిర్వహించినట్లు ఆయన వివరించారు.ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 అనేది సమగ్ర, బాధ్యతాయుతమైన మరియు ప్రభావవంతమైన ఏఐసహకారం కోసం భవిష్యత్తు ఆధారిత ఎజెండాను రూపొందించే లక్ష్యంతో ఉన్న కీలకమైన ప్రపంచ సమావేశం అని వివరించారు.

**దేశ నలుమూలల పారిశ్రామిక వేత్తలను ఒక వేదికపై:**

ఈ హ్యాకథాన్‌లో చట్టపరమైన అవగాహన, వినియోగదారుల రక్షణ, గోప్యతను కాపాడడం, మోసాల నివారణ, పర్యావరణ స్థిరత్వం, డేటా గోప్యతా సాధనాలు మరియు ఏఐ అక్షరాస్యత వంటి సామాజిక సవాళ్లను పరిష్కరించే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేసిన సుమారు 60 మంది విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలను ఒకచోట చేర్చటంలో విజయం సాధించినట్లు డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమానికి ఐఐటీ తిరుపతిలో అసోసియేట్ ప్రొఫెసర్ మరియు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ శ్రీధర్ చిమలకొండ నాయకత్వం వహించారు. దీనిని రిషా ల్యాబ్ (ఇంటెలిజెంట్ సాఫ్ట్‌వేర్ హ్యూమన్ అనలిటిక్స్‌లో పరిశోధన) మరియు డీన్ (కాంపిటెన్సీ, డెవలప్‌మెంట్ మరియు ఔట్రీచ్) ప్రొఫెసర్ అరుణ్ కె తంగిరాల నిర్వహించారని, డైరెక్టర్ ప్రొఫెసర్ కె ఎన్ సత్యనారాయణ వివరించారు.

## పోలీస్ డైరీని ఆవిష్కరించిన ఎస్పీ తుషార్ డూడి



చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: 2026 సంవత్సరపు పోలీస్ డైరీని ఎస్పీ తుషార్ డూడి సోమవారం ఆవిష్కరించారు. జిల్లా సాయుధదళ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పోలీసు అధికారులు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, సిబ్బంది హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌చార్జ్ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, డిటిసి డిఎస్పీ రాంబాబు, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ మనోహర్, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్, అడ్మిన్ ఆర్‌ఐ సుధాకర్, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, పోలీసు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విజ్ఞానం అజ్ఞానాన్ని అణచివేసే ఆయుధం : జనవిజ్ఞాన వేదిక



చౌడేపల్లె, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: విజ్ఞానమనే ఆయుధంతో అజ్ఞానాన్ని అణచి వేయవచ్చునని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులన్నారు. మండలం లోని పంచాయతీ కేంద్రం కాగతి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల క్షుద్రపూజల కలకలం రేకెత్తించింది. ఇందులో భాగంగా ఓ బాలుడు అనారోగ్యంతో మృతి చెందడంతో విద్యార్థులు పాఠశాలకు గైర్హజరయ్యారు. దీంతో స్పందించిన అధికారులు, పాలకులు జనవిజ్ఞాన వేదిక ద్వారా ప్రజా సమ్మేళనాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(గిరి) ముఖ్య అతిథిగా వచ్చారు. మనిషికి విద్యవల్ల విజ్ఞానం వస్తుందనీ, దీనివల్ల మూఢ నమ్మకాలకు పాతర వేయవచ్చు నన్నారు. ఎంపిడిఓ లీలామాధవి, ఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్రెడ్డి, ప్రకృతి వనము ప్రసాద్, ఎంఇఒ కేశవరెడ్డి, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు హరినాథ్‌శర్మ, యుగంధర్, గిరిధర్‌మూర్తి, ఎస్ఎంసి భారతి, జెవివి సుదర్శనాచారి, ప్రజ్ఞభారతి, తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, బోయకొండ సుబ్బు, నాగరాజరెడ్డి, పవన్ కుమార్, అర్జున్‌రాయల్, పరమేష్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మా ప్రధాన ధ్యేయం:ముక్కా



రైల్వే కోడూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి పనులు ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని సూరపు రాజు పల్లె, రెడ్డివారిపల్లె, దేశిష్టిపల్లి, బుడుగుంటపల్లి, విపిఆర్ కండ్రిక తదితర ప్రాంతాలలో అభివృద్ధి పనులకు రూపానందరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే కోడూరు ప్రాంతంలో అన్ని ప్రాంతాలను సమానంగా సిమెంట్ రోడ్లు, మౌలిక వసతులు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, మాజీ సర్పంచ్ సురపరాజు సుబ్బరాజు, కృష్ణంరాజు, పందేటి వెంకటరామరాజు, పోతురాజు నవీన్, హేమరాజ్, పఠాన్ మోలా, పోకల మనీ, మంగంపేట నాయకులు తల్లెం రమణారెడ్డి, పంచాయతీరాజ్ డిఇ తిప్పన బాల నరసింహులు, గడికోట సుబ్బరాయుడు, సుకుమార్, మాజీ సర్పంచ్ పుష్పలత, ఎమ్మెస్సార్, గంగరాజు సురేంద్ర రాజు, తిప్పన రాజశేఖర్, పసుపులేటి జయ చంద్ర తో పాటు కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జోగి రమేష్‌పై కేసు నమోదు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్‌లో మాజీ మంత్రి జోగి రమేష్, ఇతర కుట్రదారులపై కేసు నమోదు చేశారు. తిరుపతిరూరల్ మండలం పెరుమాళ్ళపల్లి గ్రామానికి చెందిన అరియారెడ్డి ఈశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు తిరుపతిరూరల్ పోలీస్‌స్టేషన్ సి.ఐ. చిన్న గోవింద్ తెలిపారు. ఈనెల 1న సాయంత్రం 5గంటల నుండి 5:30గంటల మధ్య తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంటలో వున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో కొంతమంది రాజకీయ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వాక్యలు ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ముఖ్యంగా మాజీ మంత్రి జోగి రమేష్ ప్రజలను, రాజకీయ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వాక్యలు చేశారని, ఆ వాక్యల వల్ల తిరుపతి నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా తిరుపతి నగరానికి ప్రపంచ వ్యాప్తంగా చెడ్డపేరు తీసుకోచ్చేలా కుట్ర పన్నినట్లు కూడా ఆరోఫణలు చేశారని ఆధారంగా తిరుపతిరూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం-43/2026గా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కేసును బిఎన్ఎస్ సెక్షన్లు 196(1), 292, 351(2), 352,353(1), 61(2), 49ఆర్/డబ్ల్యు, 3(5) కింద నమోదు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ప్రజాశాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతిరూరల్ పోలీసులు స్పష్టం చేశారు.

## అంబటి నోరు జాగ్రత్త: ఎంపీపీ



విజయపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: అంబటి రాంబాబు అహంకారపు మాటలు సభ్య సమాజం తలించుకునేలా రాష్ట్ర ప్రజానీకమే కాకుండా నీ కుటుంబ సభ్యులు కూడా సిగ్గుతో తల దించుకునేలా ఉందని ఎంపీపీ లక్ష్మీపతిరాజు తీవ్రంగా ఖండించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు టీడీపీ మండల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబు యాదవ్, పంచాయతీరాజ్ ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు చుక్క ధనంజయులు యాదవ్, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు, మాజీ ఎంపీపీ శివలింగం, రవిరాజు, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కృషి

**-తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి**

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : భక్తులకు సకల సౌకర్యాలతో రూపొందించిన కారవాన్ వాహనాన్ని రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం లోనే తొలిసారిగా రూపొందించారు. ఈ కారవాన్‌ను తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి సోమవారం తిరుపతి ఇందిరా మైదానంలో పరిశీలించారు. కారవాన్‌ను నెల్లూరువాసి అయిన వై.శ్రీనివాసరెడ్డి ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా టూరిజంశాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ కారవాన్‌లను ప్రారంభించి పుణ్యక్షేత్రాలను సందర్శిం చేందుకు భక్తులకు వెసులుబాటు కల్పించనున్నట్లు తెలిపారు... సీఎం చంద్రబాబునాయుడు టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేయాలని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను టూరిజం సర్క్యూట్‌లుగా అభివృద్ధిచేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ అధికారి రమణ ప్రసాద్, తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు, కార వ్యాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో యువతకు ప్రోత్సాహం

**-బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పృధ్వీరెడ్డి**



తిరుపతి,ఫిబ్రవరి 2ప్రభాతవార్త: పార్టీలో యువతకు ప్రాధాన్యం కల్పించేలా, పార్టీని బలోపేతం చేసేదిశగా తనవంతు పనితీరు సాగిస్తానని బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జె.పృధ్వీరెడ్డి తెలిపారు. దేశభవిష్యత్‌కు ప్రాదాన్యతనిస్తున్న ప్రధాని మోదీ నాయకత్వంలో, రాష్ట్రపార్టీ నేతల సారధ్యంలో పార్టీని మరింతగా బలోపేతంకోసం పనిచేస్తానన్నారు.రాజకీయాల్లో తనదైన శైలిలో యువతను ప్రోత్సహిస్తూ, పార్టీలో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటిగా నిలిచారు. పృధ్వీరెడ్డికి పదవి పట్ల అభిమానులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## మెరుగైన వైద్యసేవలందించాలి

**-బర్డ్ ఆస్పత్రిలో జెఈఓ డాక్టర్ శరత్**



ధార్మికసంస్థ టిటిడిలో త్వరలో ప్రారంభించనున్న శ్రీవారి వైద్య సేవపై, రోగులకు మెరుగైన వైద్యసేవలపై అవసరమైన సౌకర్యాల కల్పనపై చర్యలు చేపట్టినట్లు టిటిడి జెఈఓడాక్టర్ ఎ. శరత్ ఆరా తీశారు. బర్డ్‌ను ఆయన తనిఖీ చేశారు.